## అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఘనాపూర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బొక్క కృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతాయపల్లిలోని మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన కట్టడాల విషయమై ఫిర్యాదు అందజేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఘనాపూర్ సర్వేనంబర్లు 1140, 1141లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో అనుమతికి మించి బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై పలుసార్లు మున్సిపల్ కమిషనర్, టిపిఓలకు ఫిర్యాదుచేసినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కావడంతో ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా భారీ కట్టడాలను చేపడుతున్నారని ఫిర్యాదు చేస్తే తనపై పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



# రంగారెడ్డి I వికారాబాద్ I మేడ్చల్
# వార్త

## రామేశ్వరంలో మద్యం, మాంసం, గుట్కాలకు హైకోర్టు చెక్

**-పోలీసు, ఎక్సైజ్ శాఖలకు హైకోర్టు ఉత్వర్వులు జారీ**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
పవిత్రమైన రామేశ్వరం దేవాలయ పరిసరాలలో భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేవిధంగా మద్యం, మాంసం, గుట్కా విక్రయాలు తదితర అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్న వారిపట్ల హైకోర్టు కొరడా ఝుళిపించింది. ఫరూఖ్‌నగర్‌మండలం రామేశ్వరందేవాలయం జాతరసందర్భంగా శివరాత్రి వేడుకలుజరుగుతున్నాయి. ఈప్రాంతంలో కొంతమంది అసాంఘికకార్యకలాపాలతో మద్యం, మాంసం, గుట్కా, తదితర నిషేధిత పదార్థాలను విక్రయిస్తున్నారని రాయికల్ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, తదితరులు హైకోర్టులను ఆశ్రయించారు. రెడ్ పిటిషన్ నెం.5461/2025ద్వారా హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయమూర్తి నాగేష్ భీమపాక మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత ఎక్సైజ్ పోలీసుశాఖలు వెంటనే చర్యలుతీసుకోవాలని రామేశ్వరంపరిధిలోని దేవాదాయశాఖకు సంబంధించిన ఎండోన్‌మెంట్‌స్థలాలలో అసాంఘికకార్యకలాపాలు చేపట్టకుండా సంబంధితశాఖల అధికారులు


కీసరగుట్టలో యాగశాలలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు


గర్భాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


క్రీడా మైదానంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

# కీసరగుట్ట.. భక్తులతో కిటకిట

**కీసర, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
కీసరగుట్ట పుణ్యక్షేత్రం భక్తులతో మంగళవారం కిటకిటలాడింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు నగరంలోని వివిధప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి గర్భాలయంలో స్వామివారికి తేనె, ఆవుపాలు, పంచామృతంతో ప్రత్యేక రుద్రస్వాహకారహోమం నిర్వహించారు. అభిషేకాల అనంతరం భక్తులు నేరుగా కాశీవిశ్వేశ్వరాలయం, శ్రీలక్ష్మీనృసింహ్మస్వామి, నాగదేవత ఆలయాలను దర్శించుకున్నారు. రాజగోపురం ఎదుట ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారికి ఉదయం 9గంటలకు రుద్రస్వాహకారహోమం, సాయంత్రం 4గంటలకు బిల్వార్చన, రాత్రి 7గంటలకు ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, పరకాస్తవం, తీర్థ ప్రసాదవినియోగం, రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారు కీసరగ్రామంనుండి కీసరగుట్టకు విచ్చేయుట తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

**కీసరగుట్టలో క్రీడా వివరాలు...**
కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడల్లో కబడ్డీ మొదటిబహుమతి సెయింట్‌జోసెఫ్ స్కూల్ రాంపల్లి, రెండవబహుమతి జడ్పిహెచ్ఎస్ రాంపల్లి, ఖోఖోలో బాలుర మొదటిబహుమతి జడ్పిహెచ్ఎస్ తూంకుంట, విజ్ఞానభారతి తూంకుంట, బాలికలలో జడ్పిహెచ్ఎస్ జీడిమెట్ల, జడ్పిహెచ్ఎస్ తూంకుంట, వాలీబాల్ బాలికలవిభాగం మొదటివిజేత తుర్కపల్లిస్కూల్, రెండవ బహుమతి జడ్పిహెచ్ఎస్ తుర్కపల్లి, బాలుర విభాగం విజేత తుర్కపల్లిస్కూల్, టిఎస్ఆర్ కీసరగుట్ట తదితర పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు.

## స్పీకర్‌ను కలిసిన ఆదివాసీ కాంగ్రెస్‌నేతలు


స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆధికారిక నివాసంలో తెలంగాణరాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్, ఇంచార్జి బుడ్డ సత్యనారాయణ, శాంతిబాయి, రమేష్, శేఖర్, వినోద్ తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏఐసిసి డైరెక్షన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ఆదివాసీ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల శిక్షణ శిబిరం వికారాబాద్‌జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్‌లో జరగనున్న కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆహ్వానించారు. ఆదివాసీ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దుతూ వారికి భారతరాజ్యాంగంపైన, భారతచట్టాలపై, ఆదివాసీలకు కల్పించిన హక్కులపైన, అనేక అంశాలపై నిపుణులుతో శిక్షణశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం దేశంలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటగా గతనెలలో నాగార్జునసాగర్‌లో అన్నిరాష్ట్రాల ముఖ్యులతో ఏడు రోజుల శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## విస్తరణకు సహకరించండి...బాధితులను ఆదుకుంటాం

**-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, ఫిబ్రవరి12, ప్రభాతవార్త:**
ప్రయాణికులకు, ప్రజలకు ఎదురవుతున్న ఇరుకురహదారి సమస్యను తొలగించేందుకు చేపడుతున్న రోడ్డువిస్తరణకు ప్రజలంతా సహకరించాలని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యంకావాలని, ప్రభుత్వనిబంధనలకు సహకరించాలని ఆయన సూచించారు. గాంధీచౌక్ నుండి సందబావి వరకు జరిగే రోడ్డువిస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులతో మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రత్యేకసమావేశం నిర్వహించారు. రూ.37కోట్లతో చేపడుతున్న షాద్‌నగర్-మాడ్గుల రహదారివిస్తరణలో ఆమనగల్లులో ఎదురవుతున్నసమస్యపై బాధితులతో చర్చించారు. విస్తరణపనులు పూర్తిచేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే అన్నారు. మధ్యభాగం నుండి 30ఫీట్ల విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరగా, అందుకు ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. రహదారి వెంట బీదకుటుంబాలే అధికంగా ఉన్నాయని, ఇళ్లు కోల్పోతే రోడ్డున పడతామని వారు ఆందోళన వ్యక్తంచేశారు. అభివృద్ధికి మేముకూడా సహకరిస్తామని, దానికిగాను 25ఫీట్ల వెడల్పుతో చేపట్టాలని కోరారు. గతంలో 25ఫీట్లు ఇవ్వడానికి కలిసికట్టుగా తీర్మానంచేసుకుని మున్సిపాలిటీకి అందజేశామని, దానిప్రకారమే విస్తరణచేపట్టి తమకు న్యాయంచేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ ఇళ్లు కోల్పోయేపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇప్పించే బాధ్యత స్వీకరిస్తానని, శాయశక్తుల న్యాయంచేయడానికి కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. అయితే అందుకు బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. సురసముద్రంచెరువు వంతెననుండి 25ఫీట్లు విస్తరణచేయడంతో అదేమాదిరిగా కొనసాగించాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, కమిషనర్ శంకర్‌నాయక్, మాజీ వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, అప్పం శ్రీను, గుర్రం కేశవులు, తెల్లగమళ్ళ జగన్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, వస్పుల మానయ్య, కృష్ణానాయక్ తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్-పూర్ణ ఫ్యాసింజర్‌ను చిట్టిగిద్ద రైల్వే స్టేషన్‌లో ఆపాలి

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**


సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్ అరుణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ళ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
హైదరాబాద్-పూర్ణ ఫ్యాసింజర్‌ను చిట్టిగిద్ద రైల్వే స్టేషన్‌లో ఆపాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరారు. మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్ అరుణ్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కలిసి పలుసమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ హుబ్లీ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-బీదర్, ఎల్‌టిటి ట్రైన్‌లను శంకర్‌పల్లి స్టేషన్‌లో ఆపాలన్నారు. నవాబ్‌పేట్ మండలంలోని చించల్‌పేట్, చిట్టిగిద్ద, ముబారక్‌పూర్ గ్రామాలలో మూడు అండర్ రైల్వేబ్రిడ్జిలను మంజూరుచేయాలని కోరారు. చేవెళ్ల నియోజకవర్గంలోని రైల్వేస్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## జోరుగా పండ్ల విక్రయాలు..పెరిగిన ధరలు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మహాశివరాత్రి సందర్భంగా పండ్లధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. పండుగతో మార్కెట్‌కు ప్రజలు పోటెత్తడంతో వ్యాపారులు ధరలను పెంచేశారు. శివరాత్రి రోజున శివుడికి ఉపవాసదీక్షలు పాటించే భక్తులందరూ సాయంత్రంవేళల్లో పండ్లతోనే దీక్షను విరమిస్తారు. దీంతో వ్యాపారులు దీనిని ఆసరాగాచేసుకొని అన్ని పండ్లధరలను ఏకంగా పెంచి విక్రయాలు సాగించారు. బుధవారం శివరాత్రి సందర్భంగా ఘట్‌కేసర్‌లోని రహదారిపై పలుచోట్ల పళ్లదుకాణాలు వెలిశాయి. పలుచోట్ల టెంట్లు వేసుకొని వ్యాపారులు వివిధరకాల పండ్లను విక్రయిస్తున్నారు. పుచ్చ, అరటి, తర్బుజ, ద్రాక్ష, కమలం, చిలగడదుంప, ఖర్జూరం, దానిమ్మ, ఆపిల్, జామపళ్లతో పాటు ప్రమిదల, పూలవిక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. పండ్లు, పూలు కొనడం అనివార్యం కావడంతో వ్యాపారులు పూలు, పండ్లధరలను పెంచి అమ్మకాలుచేశారు. మామూలురోజుల కంటే అధికంగా ధరలుపెంచి ప్రజలకు పండ్లను విక్రయిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయం ప్రకారం శివరాత్రి పండుగ జరుపుకోవడంలో ఎంతఖర్చైనా కూడా వెచ్చించి పండ్లు తీసుకొని వెళ్తారు. పండ్లతోపాటు పండుగకు అవసరమైన అన్నిరకాల వస్తువులను కొనుగోలు చేయడంతో ఘట్‌కేసర్‌మార్కెట్ రద్దీగామారగా బైక్‌లు రోడ్డుపైనే నిలిపివేయడంతో పాదచారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతున్నది.

## పదవతరగతి పరీక్షలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదు

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తిబాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశమందిరంలో విద్యాశాఖ అధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులకు ఏర్పాటుచేసిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో జరిగే 10వ తరగతి పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పదవతరగతి పరీక్షలు మార్చి 21నుండి ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలో 69పరీక్ష సెంటర్లు ఏర్పాటుచేయడం జరిగిందని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30నుండి మధ్యాహ్నం 12.30గంటలవరకు పరీక్షలు ఉంటాయని, విద్యార్థులందరూ వారి హాల్‌టికెట్లు సరి చూసుకోవాల్సిందిగా సూచించారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలను ఒకరోజు ముందుగానే సందర్శించి, ప్రతిరోజు ఒక గంట ముందుగానే పరీక్షాకేంద్రానికి చేరుకోవాల్సిందిగా తెలిపారు. విద్యార్థులు, పరీక్షలను నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు, సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోను తీసుకురాకూడదని సూచించారు. పరీక్షాకేంద్రంలో, పరిసరాల్లో సెల్‌ఫోన్‌లు పూర్తిగా నిషేధించినట్లుగా తెలిపారు. పదవతరగతి పరీక్షలకు 6450బాలురు, 6453మంది బాలికలు, మొత్తం 12903మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. చిన్నసమస్య కూడా రాకుండా ప్రభుత్వ ఆదేశాలప్రకారం వెళ్లాలని, పరీక్షలకు సంబంధంలేని వ్యక్తులు, ఎవరినీ కూడా పరీక్ష హాలులోకి అనుమతించరాదని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని స్పష్టంచేశారు. పరీక్షాకేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షాకేంద్రాలలో ఫర్నిచర్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పదవతరగతి పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలుతీసుకోవాలని తెలిపారు. ఈసమావేశంలో అదనపుకలెక్టర్ సుధీర్, డిఈఓ రేణుకాదేవి, ఏసిజిఈ రాంరెడ్డి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భావికి బాటవేసే స్టడీమెటీరియల్స్‌ను అందించాలి

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**
**-గురుకుల సంక్షేమ పాఠశాలల ఆకస్మిక తనిఖీ**
**-విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం**


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

**(మేడ్చల్ జిల్లా ప్రతినిధి)**
**శామీర్‌పేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
ఉత్తమమార్కులు సాధించే విద్యార్థులకు భవిషత్‌లో చదువుకునే కోర్సులపై మార్గదర్శకం అందిస్తూ వారికి అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపల్‌ను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కృషి, పట్టుదల ఉంటే క్రమశిక్షణే మీ విజయానికి కారణమని, పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించి భవిషత్ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని కలెక్టర్ గౌతమ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం శామీర్‌పేటమండలంలోని తుర్కపల్లిలోగల కూకట్‌పల్లి, జూబ్లిహిల్స్, కుత్బుల్లాపూర్, నాంపల్లిలకు కలిపి నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ గురుకుల (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని కలెక్టర్ తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిషత్‌కు లక్ష్యసాధన ఉండాలన్నారు. భవిషత్‌లో ఏమిచదవాలనుకుంటే ఆలక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని అదేదిశగా ముందుకు సాగాలన్నారు. పదవతరగతిలోని ప్రతివిద్యార్థితో కలెక్టర్ ముచ్చటించారు. భవిషత్‌లో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచిమార్కులు సాధించాలని, విద్యతోనే భవిషత్ బాగుంటుందని తెలిపారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ రాత్రిభోజనం చేశారు. భోజనశాలలో టేబుల్స్, కుర్చీలు సరిపడ విద్యార్థులకు ఏర్పాటుచేయాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. తరగతిగదులలో పనిచేయనిఫ్యాన్స్‌ను వెంటనే మరమ్మతు చేయాలని కలెక్టర్ ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. మెనూప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ఈరోజు మెనూప్రకారం ఏమి వంటలుచేశారని ఆయన పరిశీలించారు. స్కూల్, కాలేజీకి సంబంధించినవివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలతహసీల్దార్‌యాదగిరిరెడ్డి, ఎంపిడిఓమమతాబాయి, డిసిఓ రాజేశ్, ఆర్‌సిఓవెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తును నిర్వహించాలి

**-మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి**

**మహేశ్వరం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మహేశ్వరంలోజరిగే శివగంగాబ్రహ్మోత్సవాలను సమన్వయంతో పటిష్టబందోబస్తును నిర్వహించాలని మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి తెలిపారు. మంగళవారం శివగంగదేవాలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పోలీసులు నిర్వహించే విధులపట్ల అవగాహనకల్పించారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ.. దేవాలయ దర్శనానికి వచ్చే ప్రజలతో మర్యాదతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని అన్నారు. దేవాలయం ప్రాంగణంవద్ద దర్గా ఉండడంతో పోలీసులు మరింత అప్రమత్తతోమెలగాలని ఆమెసూచించారు. కుల, మతాల ఘర్షణలకు తావులేకుండా నిబద్ధతతో విధులనునిర్వహించాలని అన్నారు. ఏదైనా సంఘటనలు జరిగితే పైస్థాయి అధికారులకు తెలపాలని ఆమె తెలిపారు. మహిళల పట్ల ఆకతాయిలు చేసే అల్లరి పనులను, దొంగతనాల నివారణకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అన్నారు. నిర్వహిస్తున్న విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే పైస్థాయి అధికారులకు తెలపాలని అన్నారు. పార్కింగ్ ఇతరభద్రత ఏర్పాట్లను వాహనాల డైరెక్షన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందుకుసాగాలని అన్నారు. పోలీసులు ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలను నిర్వహిస్తూ చాకచక్యంగా వ్యవహరించాలని ఆమెసూచించారు. బ్రహ్మోత్సవాలు ముగింపుపలికే వరకు ఉద్యోగాలను నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. పోలీస్‌స్టేషన్‌వద్ద డ్యూటీలో ఉన్నవారికి భోజనాలను ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఉద్యోగి తన రిలీవర్ వచ్చేవరకు వేచిచూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏసిపి లక్ష్మీకాంత్‌రెడ్డి, సిఐలు వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, కృష్ణంరాజు ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**కీసర, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రహీంఖాన్‌గూడకు చెందిన గూడూరు చంద్రశేఖర్ (32) బతుకుదెరువుకోసం తార్నాకలో టైలర్‌గా పనిచేస్తున్నాడు. లాలాపేట శాంతినగర్‌లో ఉండే అతని సోదరుడు మత్స్యగిరి(27) విజయడైరీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ అల్లుడు శ్రీను(17)తోకలిసి యాద్గార్‌పల్లిగ్రామంలోని తనబంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరుగు ప్రయాణం అవ్వగా చీర్యాల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఎదురుగా కారు అతివేగంగావచ్చి బైక్‌ని ఢీకొట్టింది. తీవ్రగాయాలైన చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మత్స్యగిరి గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. కాగా వచ్చేనెల 20వ తేదీన మత్స్యగిరివివాహం ఉంది. ఇద్దరు కొడుకులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబసభ్యులు భోరున విలపించారు. ఈకేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు బైకులు ఢీ...ఒకరి మృతి..

**పరిగి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
వికారాబాద్‌జిల్లా పరిగిపురపాలక శివారులో కృష్ణవేణిటాలెంట్‌స్కూల్ దగ్గరలో సోమవారంరాత్రి కంటైనర్‌ను తప్పించబోయి బుల్లెట్ హంటర్ బైక్‌పై వెళ్తున్న ఎం.శ్రీశైలం ఎదురుగావస్తున్న మరోబైక్‌పై ఉన్నదంపతులను ఢీకొట్టగా, రెండు బైకులు కంటైనర్‌ను ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే రంగపల్లిగ్రామానికి చెందిన ఎం.పద్మ కుమారుడైన శ్రీశైలం బుల్లెట్ బైక్‌పై వెళుతూ, అతివేగంతో కంటైనర్ కొడంగల్‌వైపు వస్తుందని, దానిని తప్పించబోయి సుల్తాన్పూర్ గ్రామానికి చెందిన మల్లేష్, అమృత దంపతుల బైక్‌ను ఢీకొట్టగా, ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురినీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పద్మ కుమారుడైన శ్రీశైలం అప్పటికేమరణించాడని డాక్టర్లుతెలిపారని, గాయాలైనదంపతులను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారని, తన కుమారుడిమృతికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌పై చర్యలుతీసుకోవాలని పద్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

## ఆస్తి కోసం తండ్రిని చంపిన తనయుడు!

**పరిగి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
వికారాబాద్‌జిల్లా పరిగిమండలం రావులపల్లిగ్రామానికి చెందిన అబ్దుల్ రహీం రెండోభార్య కుమారుడైన పీర్ మహమ్మద్, తనతండ్రిని సోమవారంరాత్రి 8:30 ప్రాంతంలో రావులపల్లి శివారులోని హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థరెడ్డి ఫామ్ హౌస్‌లో(పీర్ మొహమ్మద్ పనిచేస్తున్న ఫామ్‌హౌస్) కర్రలతో తీవ్రంగా గాయపరచాడని, అదేగ్రామానికి చెందిన వ్యక్తి విడిపించాడని, ఇంటికి వెళ్లి పడుకున్న చోటే అచేతనుడిగా అబ్దుల్‌రహీం పడి ఉండడంతో, బంధువులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి తీవ్రంగా ఉందని ఉస్మానియాకు తరలించాలని డాక్టర్లు తెలపగా హైదరాబాద్ తీసుకువెళుతున్న సమయంలో మార్గంమధ్యలోనే అబ్దుల్‌రహీం చనిపోయాడని, అబ్దుల్‌రహీంసోదరి కరీమాబీ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆస్తిలో వాటాయివ్వాలని, కక్షపూరితంగా తండ్రినిచంపిన పీర్ మొహమ్మద్‌పై చట్టరీత్యా చర్యలుతీసుకోవాలని కరీమాబి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అరెస్టుచేసి దర్యాప్తుచేస్తున్నామని పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## ఉరివేసుకొని తల్లీకొడుకుల మృతి

**-కుటుంబ కలహాలే కారణం అంటున్న గ్రామస్థులు**
**-విచారణ చేపట్టిన పోలీసులు**
**-నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు**

**బషీరాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
తల్లీకొడుకులు ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలపరిధిలోని కాశీంపూర్‌గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మాల మొగులప్పభార్య రేణుక డబ్బులకోసం మొగులప్పతో తరచూ గొడవపడుతుండేదని గతంలో వారు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడు కాశీంపూర్ గ్రామపంచాయతీ పారిశుధ్యకార్మికునిగా పనిచేస్తూ జీవించేవాడని తనకువచ్చే వేతనం పూర్తిగా ఇవ్వాలంటూ మృతుడిభార్య గతంలో పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. రేణుక ఒత్తిడితట్టుకోలేక మనస్తాపంతో తల్లిఎల్లమ్మ(50), కొడుకు మొగులప్ప (35) సోమవారంరాత్రి ఇంట్లోదూలానికి చీరలతో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకొని ఉంటారని పోలీసులుతెలిపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికివెళ్లి విచారణచేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాండూర్‌జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వైద్యులరిపోర్టు ఆధారంగా మీడియాకు వివరాలు వెల్లడిస్తామన్నారు.

**మృతుడి సోదరి ఫిర్యాదు:**
మృతుడి సోదరి నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు బషీరాబాద్ ఎస్ఐ శంకర్ తెలిపారు.

**తల్లి, సోదరుడిమృతి పట్ల సోదరి అనుమానాలు:**
డబ్బులకోసం అత్త ఎల్లమ్మతో, భర్తతో రేణుక తరచూ గొడవ పడుతుండేదని మృతుడిసోదరినర్సమ్మ పలు అనుమానాలు వ్యక్తంచేసింది. వీరిది ఆత్మహత్యా, లేక తానే నేరానికి ఒడికట్టిందా అన్న అనుమానాలను వ్యక్తంచేసింది. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పోలీసులను కోరుతుంది.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ఆమనగల్లు, ఫిబ్రవరి25,** ప్రభాతవార్త: ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గల లిటిల్ స్కాలర్స్ హై స్కూల్‌లో మంగళవారం జరిగిన స్వపరిపరిపాలన దినోత్సవ కార్యక్రమానికి ఇరువురులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాభోధన గావించారు. అలాగే స్వపరిపాలనలో 20 మంది విద్యార్థులు ఉన్నతాధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. వీరితోపాటు మరో 100 మంది విద్యార్థులుఉపాధ్యాయులుగా పాత్రలు పోషించి అలరించారు. చూడముచ్చటైన వస్త్రధారణతో స్వపరిపాలనలో పాల్గొని ఆకుట్టుకున్నారు. స్వ పరిపాలనను తిలకించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఇతరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కరస్పాండెంట్ జిల్లెల సుజాతసుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిగాయి. ముగింపు వేడుకల్లో సుదర్శన్‌రెడ్డి, అల్లాజీగౌడ్‌లు మాట్లా డుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రానున్న పోటీ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజి గౌడ్, డైరెక్టర్ చుక్క సావిత్రి, పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ జిల్లెల్ల సుదర్శన్‌రెడ్డి, కరస్పాండెంట్ జిల్లెల సుజాత సుదర్శన్‌రెడ్డిలు స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఈర్లపల్లి శ్రీశైలం, ఉపాధ్యాయులు గజ్జ యాదయ్య, తాళ్ళ రేవతి, రమాదేవి, మాధురి, బాలు, వినయ్, ఆయూబ్, మహేష్, పాల్గొన్నారు.

## రాములు యాదవ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు



**నారాయణఖేడ్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో రజిత పతకాన్ని కైవశం చేసుకున్న పిఈటి రాములుయాదవ్‌ను మంగళవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, సుజాత, మధుకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జ్ఞానమదన్, శివభార్గవ్, ప్రభు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోర్గిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



మోర్గి పాఠశాలలో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోర్గి గ్రామంలోని మోడల్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, అధ్యాపకులు, ఒక రోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంజీవన్‌రావుపేటలో స్వయం పాలన



సంజీవన్‌రావు పేటలో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జల్లా కలెక్టర్‌గా సింధు, డిఈఓగా సంతోష్,ఎంఈఓగా అమర్‌నాథ్, ప్రధానోపాధ్యాయులుగా భవ్య, ఉపాధ్యాయలుగా విద్యార్థులు బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమయ్య, ఉపాధ్యాయులు గోపాల్, సుదర్శన్, ధర్మేందర్, లక్ష్మి, సునీతలు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ




పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** రెండవ ఓపెన్ నేషనల్ కుంగ్-ఫూ ఎస్‌బిఆర్ కప్ 2025 టోర్నీలో రామాయంపేట షావోలిన్ కుంగ్-ఫూ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. సోమవారం సంగారెడ్డి వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాదర్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన ఈ పోటీల్లో పలు విభాగాల్లో పథకాలు సాధించారు. కె. శివకృష్ణగౌడ్ బ్లాక్ బెల్ట్ ఫైట్ విభాగంలో గ్రాండ్ ఛాంపియన్‌షిప్ సాధించగా, చిలుక సురేష్ ఉత్తమ పోరాటాన్ని ప్రదర్శించి బెస్ట్ ఫైటర్ అవార్డును అందుకున్నాడు. అలాగే ఆల్ కలర్ బెల్ట్ ఫైట్ విభాగంలో మాసుల ఆధ్యశ్రీ గోల్డ్ మెడల్, మాసుల సుహార్షిణి సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఇప్పటి వరకు తమ శిక్షణతో విద్యార్థులను ప్రోత్సహించిన మాస్టర్‌లు పి.సందీప్, ఎ.ప్రశాంత్, విజయ్, స్వామిలకు బెస్ట్ ఇన్‌స్ట్రక్టర్ అవార్డులు లభించాయి. విజేతలకు శిక్షకులు సీనియర్ మాస్టర్ ఎం. శ్రీనివాస్, సీనియర్ మాస్టర్ ఎస్.కె.అహ్మద్ అభినందనలు తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేశారు. మరింత మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** చిన్ననీటి పారుదల ప్రాజెక్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఘనపూర్ ఆనకట్ట నీటిలో ఓ గుర్తు తెలియని (30 ఏళ్లు) వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నామని చెప్పారు. మృతదేహంపై పచ్చని టీషర్టు, నల్లని షర్ట్ చెక్కరు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని నీటిలో నుంచి వెలికితీయించి పరిశీలించామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు, గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే 8712 657930కు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు

# నేటి నుంచి మహాజాతర ఉత్సవాలు షురూ

### ప్రారంభించనున్న మంత్రి దామోదర్



ఏడుపాయల జాతరకు వచ్చే భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు దృశ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లాలోని ఏడుపాయల మండలం నాగ్సాన్‌పల్లి దండకారణ్యంలో స్వయంభువ దేవతగా భక్తులచే నిత్య పూజలందుకుంటున్న వనదుర్గా భవాని మాత మహాజాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వనదుర్గామాతను ఆయా ప్రాంతాల నుంచి 10 లక్షలకు పైగా భక్తులు దర్శించుకోనున్నారు. దేశంలోని కాశ్మీరులోఉన్న వనదుర్గామాత ఆలయం శిథిలావస్థకు చేరి మూతపడగా రెండవదైన తెలంగాణలోని మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లిలోని ఏడుపాయల వనదుర్గాభవాని మాత చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. ఏడుపాయల్లో ఈ నెల 26వ తేదీనుంచి 3 రోజుల పాటు మహాజాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి జాతర ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా జాతర ప్రత్యేక అధికారి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఈఓ చంద్రశేఖర్, అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

**ఏడుపాయలకు ఇలా వెళ్లాలి...**

కర్ణాటకలోని బీదర్,నారాయణఖేడ్, జహీరాబాద్, బొడ్మట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి ఏడుపాయలకు చేరుకోవచ్చు. రోడ్డు పక్కనే ఏడుపాయల కమాన్ మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు.ఆర్టీసి బస్సులతో పాటు ప్రైవేటువాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు. భక్తులు తమ వాహనాలను చేలిమేలకుంట, పోలీసు చెక్‌పోస్టువద్ద పార్కింగ్‌చేసి కిలో మీటరు మేర కాలి నడకన ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవచ్చు. హైదరాబాద్, సికింద్రాబాద్, బాలానగర్, నర్సాపూర్, సంగారెడ్డి, జోగిపేట ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పోతాన్‌శెట్టిపల్లి నుంచి నూతనంగా ఏర్పాటుచేసిన రోడ్డుగుండా ఏడుపాయలకు చేరుకోవచ్చు. ఏడుపాయల రెండ బ్రిడ్జి వద్ద వీరు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. వృద్దులు, వికలాంగులు, చిన్నారుల సౌకర్యార్థం 10 మినీ బస్సులను రెండు ప్రాంతాల పార్కింగ్ స్థలాల నుంచి తిప్పుతారు.

**జాతరలో ఏర్పాట్లు...**

ఏడుపాయల మహాజాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉండటంతో వివిపి క్యూలైన్లు, ధర్మదర్శన క్యూలైన్‌లు, స్నానాలు ఆచరించేందుకు షవర్లు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు గదులు, తాగునీటి కుళాయిలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పారశుధ్య కార్మికులను పెద్ద ఎత్తున నియమించారు. నీటి ప్రమాదాలు జరుగకుండా గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**పాత బొమ్మలు-విరిగిన కొమ్ములు...**

వనదుర్గా భవాని మాత ఆలయం ముందు ఉన్న పాయలో ఏర్పాటు చేసిన శివలింగం ప్రతిమ పక్కన ఏర్పాటు చేయనున్న శివప్రతిమతోపాటు వివిధ రకాల ప్రతిమలు రంగు మారి పాత ప్రతిమలను ఏర్పాటు చేయడమే కాకుండా కాడెడ్ల ప్రతిమకు కొమ్ము విరిగి ఒంటి కొమ్ము ఎద్దులా దర్శనమిస్తోంది. భక్తులకు ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదంగా చేయాల్సిన ఏర్పాట్లు తూతూ మంత్రంగా పాత మొమ్మలు, విరిగిన కొమ్ములులా దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలు తీసుకునే గుత్తేదారు ఇష్టారీతిగా ఏర్పాట్లు చేస్తూ మమ అనిపిస్తున్నాడని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

**జలం లేదు-ప్రసాదం రాదు...**

వేసవి కాలానికి ముందే ఎండలు మండుతుండటంతో ప్రజలు తమ దప్పికను తీర్చుకునేందుకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. ఆలయ ఈఓ కార్యాలయం ముందు లక్షల రూపాయలు వెచ్చించి అరబిందో ఫార్మ కంపెనీ వారు తాగునీటి శుద్దీకరణ యంత్రాన్ని ఆలయానికి అందచేశారు. నెలరోజులుగా యంత్రంలో నీరు లేక జల ప్రసాద యంత్రం ఉత్సవ విగ్రహంగా మిగిలిపోయింది. తన కార్యలయం ముందున్న నీటి వసతి యంత్రంలో నీరు లేకున్నా తగు ఏర్పాట్లు, చర్యలు తీసుకోకపోవడంతో పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మురుగు తొలగదు..బ్లీచింగ్ లేదు...**

మహాజాతరకు లక్షలాదిగా భక్తులు ఆయా ప్రాంతాల నుంచి తరలివస్తారని అంచనాలు వేసిన అధికారులు భక్తుల కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాల్లో వెలితి మాత్రం కొట్టొచ్చినట్లు కానవస్తోంది. రాజగోపుం వద్ద కేశఖండనం వైపు వెళ్లేదారిలో మురుగు నీరు చేరి నీటిపై దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. బండలపై పాకుడు పేరుకుపోవడంతో కాలు జారి కింద పడే సూచనలు కానవస్తున్నాయి.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : ఈఓ చంద్రశేఖర్**

మూడు రోజుల పాటు కొనసాగనున్న మహాజాతరను పురస్కరించుకుని ఆలయానికి సదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు (10 లక్షల మంది భక్తులు) ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు ఆయా శాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు ఇఓ చంద్రశేఖర్ వివరించారు.



సీతయ్య గుడిని రంగులతో తీర్చి దిద్దిన దృశ్యం

## శివరాత్రికి ముస్తాబైన దేవాలయాలు

**రామాయంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణంలోని సిద్దిపేట రోడ్డులోఉన్న శ్రీ రాజరాజేశ్వర దేవాలయం (సీతయ్య గుడి) శివరాత్రికి ముస్తాబయింది. పట్టణంలో అతి ప్రాచీనమైన గుడిలో సీతయ్య గుడి ఒకటి. అయితే గుడిలో కొన్ని సౌకర్యాలు లేని కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా దేవాలయ కమిటీ సభ్యుల సూచన మేరకు కొంతమంది దాతలు ముందుకు వచ్చి గుడిని అభివృద్ధి పరిచారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి భక్తులు ఈ గుడికి తండోపతండాలుగా వచ్చి భోలా శంకరుని కరుణాకటాక్షాలు పొందుతారు. పట్టణములో సీతయ్యగుడి అంటే తెలియని వారు ఉండరు. రామాయంపేట పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సరాఫ్ సౌభాగ్య శ్యాంసుందర్, కొత్త శ్రీనివాస్, కొత్త నాగరాజు, స్వర్గీయ గద్దె బాలకిష్టయ్య-రుక్కమ్మ, పబ్బ శ్రీనివాస్, స్వర్గీయ బాజా నరసింహులు-లక్ష్మి, కటికె శివలాల్ తదితర దాతలు ముందుకు వచ్చి దేవాలయంలో పెండింగ్లో ఉన్న పనులను తమ సొంత ఖర్చులతో పూర్తి చేయించారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా రామాయంపేట పట్టణంలో ఉన్న శివాలయాలు ముస్తాబు అయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో, వివిధ రకాల పూలతో దేవాలయాలను అలంకరించారు. బుధవారం తెల్లవారుజాము నుండే భక్తులు శివాలయానికి వచ్చి అభిషేకాలు చేయనున్నారు.

**కొప్పోలు ఆలయం...**

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి దేవాలయం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం నుండి పుణ్యాహ వచనం, రుత్విక్ వరణము, అగ్ని ప్రతిష్టాపన, దుర్గా భవానికి అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు రాజశేఖర్ రెడ్డి, సీతారామారావు, గాండ్ల సంగమేశ్వర్, సతీష్ గౌడ్, శంకరయ్య, పరమేశ్వర్ రెడ్డి, ఆలయ పూజారులు సంగప్ప, మహేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.



స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పోలీసు బందోబస్తుపై సమీక్ష నిర్వహిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

## ఎమ్మెల్సీ ఎన్నికలు భారీ బందోబస్తు

### -సమీక్ష సమావేశంలో డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**జహీరాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన జరగ నున్న ఎమ్మెల్సీ ఎన్నికల(పట్టభద్రుల, ఉపాధ్యాయ) నేపథ్యంలో జహీరా బాద్ పట్టణంతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు డిఎస్‌పి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ పోలసు ఠాణా ఆవరణలో డివిజన్ లోని ఆయా పోలీసు ఠాణా అధికారులు, సిబ్బందితో ఎన్నికల బందో బస్తుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి పోలీసులకు పలు సూచనలు, జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కొరకు ఒక డిఎస్‌పి, ఇద్దరు సిఐలు, 10 మంది ఎస్ఐలు, 60 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తును నిర్వహించనున్నట్లు డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి వివరిం చారు. కార్యక్రమంలో పట్టణ సిఐ శివలింగం, రూరల్ సిఐ జెక్కుల హనుమంతు, ఎసైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పటాన్ చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ లో గల శ్రీశ్రీశ్రీ మహాదేవుని ఆలయంలో నిర్వహించే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల పోస్టర్ ను మంగళవారం ఆలయ ప్రాంగణంలో స్థానిక శాసనసభ్యులకు గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన శివాలయాలలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదినాన్ని నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు కొమరగూడెం వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, శివస్వాములు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

**కొల్చారం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంసాన్‌పల్లి, దేవునివెంకటాపూర్ గ్రామాల్లో మంగళవారం ఏరువాక కేంద్రం సంగుపేట, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి పొలాలను పరిశీలించారు. ప్రధానంగా ఈ యాసంగిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సాగులో పాటించవలసిన మెలకువల గురించి రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త (కోఆర్డినేటర్) శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ వరి పొలములో అక్కడక్కడ సల్ఫైడ్ దుష్ప్రభావ లక్షణాలు గమనించడం జరిగిందని, ఈ లక్షణాలు గమనించనట్లయితే పొలములో అడుగు పెట్టినపుడు బుడగల రూపంలో నీరు మారి, మొక్కను వేర్లతో బయటకి తీసినప్పుడు కుళ్ళిన కోడి గుడ్ల వాసన వచ్చునని, ఈ లక్షణాలకు ముఖ్య కారణం కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వాడటమని, అలాగే వేర్లకు సరిగ్గా నీరు అందక పోవడమని, నివారణకు నాటు వేసిన పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెడుతు ఉండాలన్నారు. అలాగే జింక్ సల్ఫేట్ 2 గ్రా/లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి సూచించారు. ముఖ్యంగా నాటు వేసే 15 రోజుల ముందు రైతులు సింగిల్ సూపర్ ఫాస్పేట్ అనే ఎరువును పొలమంతా చల్లి కలియదున్నుకోవడం వల్ల లోప లక్షణాలు రాకుండా ఉండటానికి ఆస్కారం వుంటుందని తెలిపారు. పొలంలో అక్కడక్కడ అగ్గి తెగుల్ల లక్షణాలు గమనించడం జరిగిందని, నివారణకు ట్రిసైక్లోజోల్ 0.6 గ్రా లేదా ప్రికాప్సి(స్ట్రోబిన్+ట్రైసైక్లో జోల్ (గెలీలియో సెన్స) 2 మీ. లీ/లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ, ఏఆర్ఎస్ తోర్నాల శాస్త్రవేత్త డా. శ్రీజయ (మృత్తికా శాస్త్రం), ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి (ఏడీ) వినయ్ కుమార్, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారిణి శ్వేతా కుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, డీఏఏటీటీఎస్ వైపీ 1 ఎస్. శ్రీకాంత్, ఆయా గ్రామ రైతులు నునావత్ బాబు, సర్వన్, వినోద్, పెద్దోళ్ల లక్ష్మణ్, పరేష్ తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

## ప్రతి గ్రామంలో సిసి రోడ్లకు ప్రాధాన్యం

### -చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య వెల్లడి



నాంచేరి గ్రామంలో సిసి రోడ్ల పనులకు శంఖుస్థాపన చేసిన చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య

**చేవెళ్ళ, ఫిబ్రవరి25, ప్రభాతవార్త :** చేవెళ్ళ మండలంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లను నిర్మించేందుకు ప్రాధాన్యతనిస్తామని చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మండలం నాంచేరి గ్రామంలో పది లక్షలు, ఖానాపూర్ గ్రామంలో 15 లక్షలు, రేగడి ఘనాపూర్ గ్రామంలో15 లక్షల రూపాలయతో నిర్మించే సిసి రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ చేవెళ్ల మండలంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లను నిర్మించేందుకు అత్యధికంగా నిధులను మంజూరు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోని కాలనీలల్లో సిసి రోడ్లను మంజూరు చేసి నిర్మిస్తామన్నారు. చేవెళ్ల మండలంలోని ప్రతి గ్రామాన్ని అదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎన్ని నిధులైన మంజూరు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలనుపరిష్కరించేందుకునిరంతరంఅందుబాటులోఉంటా మన్నారు. సిసిరోడ్లతో పాటు మురుగు కాల్వలను కూడ నిర్మించేందుకు నిధులను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి,చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచులు వడాల ప్రభాకర్, గోపాల్‌రెడ్డి,జాంగిర్,జనార్దన్‌రెడ్డి,జనార్దన్‌రెడ్డి, మండల పార్టి అద్యక్షుడు వీరేందర్‌రెడ్డి,నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి,గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

-నాంచేరి మాజీ సర్పంచ్ సక్కుబాయి అమరేందర్‌గౌడ్

నాంచేరి గ్రామంలో సిసి రోడ్లకు శంఖుస్థాప కార్యక్రమం సమాచారంను తమకు ఇవ్వలేదని నాంచేరి మాజీ సర్పంచ్ సక్కుబాయి అమరేందర్‌గౌడ్ ప్రశ్నించారు. నాంచేరి గ్రామానికి పది లక్షల రూపాయలు సిసి రోడ్డును నిర్మించేందుకు మంజూరైనవని, గ్రామస్తులకు ఎవరికి చేప్పకుండా సిసి రోడ్డు నిర్మాణంకు ఏలా శంఖుస్థాపన చేస్తారన్నారు. అధికారులు, చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య సైతం తమకు చేప్పకుండా శంఖుస్థాపన చేశారని ఆరోపించారు. గ్రామంలో అభివృద్ది పనులకు శంఖుస్థాపన చేసే మందు గ్రామంలోని గ్రామ మాజీ సర్పంచ్‌కు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు.

## ఇడబ్ల్యుఎస్‌కాలనీ ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయాలని వినతి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్



ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి వినతిపత్రంఅందజేస్తున్న ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు

ఇడబ్ల్యుఎస్‌కాలనీలో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాలని ఆకాలనీ నాయకులు మంగళవారం రాష్ట్రప్రణాళిక బోర్డు వైఎస్‌చైర్మన్-ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రంఅందజేశారు. హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం ఇడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, ప్రధానకార్యదర్శి శశిధరణ్‌లు చిన్నారెడ్డిని కలిసి ఇళ్ల సమస్యను వివరించారు. ఘట్‌కేసర్‌లోని ఈడబ్ల్యుఎస్‌కాలనీ లబ్దిదారులకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇండ్లు నిర్మించి పట్టాలు ఇచ్చారని రిజిస్ట్రేషన్‌లు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్ఓసీలు ఇప్పించాలని కోరారు. 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం 469 కుటుంబాలకు నిర్మించి ఇచ్చిన ఇళ్లకు మున్సిపాలిటీలో పేరుమార్పిడి చేయాలని కోరారు. ఓటీఎస్ కింద డబ్బులు చెల్లించిన 10 శాతం మందికి పట్టా క్లియరేన్స్ పత్రాలు ఇచ్చారని ఇంకా 90 శాతం మందికి ఇవ్వలేదని తెలిపారు. జీఓ నెం.58, 59 ద్వారా ఇళ్ల యాజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధానకార్యదర్శి బర్లరాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్‌లు ఉన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**కొడంగల్, ఫిబ్రవరి 25ప్రభాతవార్త:**కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగాజరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు. జిల్లా కలెక్టర్‌గా శివప్రసాద్, డిప్యూటీ కలెక్టర్‌గా సెమీనా, డీఈఓగా బిలాల్, ఎంఈఓగా శ్రీహరి, స్కూల్ ఫౌండర్‌గా శ్రీహర్షినికరస్పాండెంట్‌గాబిందు, ప్రిన్సిపాల్‌గా శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్‌గా బి.లక్షిత, ఉపాధ్యాయులుగా వైష్ణవి, మహిన్, అక్షర, జస్వంత్, సాయిశ్రీ, నిక్షితీ, సంగీత, షబాస్, హనుమంతు, వెంకటేష్, శరత్ తదితరులు తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో లరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబరి చ్చిన విద్యార్థులకు పాఠశాల ఫౌండర్ డి. వెంకటయ్య, ప్రిన్సిపాల్ డివి. నరేష్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష ,ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

## మండల నూతన ఎంపిఓగా రవినాయక్

**బొంరాస్‌పేట్, ఫిబ్రవరి25, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల పంచాయతీ అధికారి(ఎంపిఓ)గారవినాయక్ పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీరించారు. అయన మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో ఘట్‌కేసర్ మండలంలో విధులు నిర్వ హించి అక్కడి నుండి బదిలీపై మండలంకు రావడం జరిగింది. ఇక్కడ ఎంపి ఓగా పనిచేసిన మహేష్‌కుమార్ నూతన మండలం దుద్యాల్‌కు ఇంచార్జ్ ఎంపి డిఓగా బాధ్యతలు చేపట్టడంతో రేగడిమైలారం గ్రామంలో పంచాయతీ కార దర్శిగా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు ఎంపిఓగా బాధ్యతలు అప్పగించడం జరిగింది.

## డ్రంకన్ డ్రైవ్‌లో 42 మందికి జరిమాన

**సిర్గాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండలంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీల్లో భాగంగా నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 42 మందికి 50 వేల రూపాయల జరిమాన విధించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పట్టుకున్న డ్రంకన్‌డ్రైవ్ బాధ్యులను నారాయణఖేడ్‌లోని జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఎం.శ్రీధర్ 42 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరించారు. మొదటిసారి దొరికిన వారికి జరిమానాతో సరిపెట్టుకున్నామని, మరోసారి దొరికితే జైలు ఊసలు లెక్కబెట్టక తప్పదని వాహనాలు చోదకులకు ఎస్ఐ హెచ్చరించారు.



## ఉపాధి హామీ పనులను ప్రారంభించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కొమ్ము చెన్నయ్య

**తలకొండపల్లి ఫిబ్రవరి 25;ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము చెన్నయ్య డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ కూలీలు రైతులు ఉపాధి హామీ కూలీలకు అనుకూలంగా లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు పెట్టుబడుదారులకు అనుకూలంగా ఉందనీ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తగ్గించడం ఉపాధి హామీ కూలీలకు ఉపాధి లేకుండా చేయడమేనని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రతి జాబ్ కార్డు కు 200 రోజుల పని దినాలను కల్పించాలని దినసరి వేతనం 600 చెల్లించాలని కూలీల దినసరి బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని బడ్జెట్ లో ఉపాధి హామీ నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వము తక్షణమే బడ్జెట్ సవరించి ఉపాధి హామీ కూలీలకు రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## కుంభమేళా తిరుగు ప్రయాణంలో ఎల్లకొండ వాసి మృతి

**నవాబుపేట ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళలో పవిత్ర స్నానమాచరించేందుకు వారం రోజుల క్రితం వెళ్ళిన మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామానికి చెందిన వ్యక్తి తిరుగు ప్రాణంలో రైలునుండి పడిపోయి మృతిచెందిన సంఘటన మంగళవారం రాష్ట్ర సరిహద్దు వరంగలు ప్రాంతంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుల్గారి సుదర్శన్‌రెడ్డి (65) అదే గ్రామానికి చెందిన ర్యావరెడ్డి, చంద్రశేఖర్‌లతో కలిసి రైలులో ప్రయాగ్‌రాజ్ కుంభమేళకు వారం రోజులక్రితం వెళ్ళారు. పవిత్ర స్నానం ఆచరించారు. ఈ నేపథ్యంలో సుదర్శన్‌రెడ్డి తిరుగు ప్రయాణంలో కొంత మానశిక పరివర్తనలో కొంత మార్పు కనిపించిందని ఎట్టకేలకు విడిచి పెట్టకుండా తోటివారు జాగ్రత పడుతూ ప్రయాణిసున్న తరుణంలో మంగళవారం తెల్లవారు జామున ఆయన మానశిక ప్రవర్తన కొంత ఆశ్చర్య కరంగా మారిందని కదులుతున్న రైలునుండి పడివేయాడని తెలిపారు. దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయాన్ని సెల్‌ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు తెలియజేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు అక్కడి రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకుని శవ పరీక్షలకు మృతదేహాన్ని పంపించినట్లు వారు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

-కొడంగల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్

**దౌల్తాబాద్,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని యువజన కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ ఉపాధ్యాయులకు ఆదేశించారు.దౌల్తాబాద్ మండలంలోని జడ్పీహెచ్ఎస్‌హైస్కూల్,బిసి వెల్ఫేర్ హస్టల్‌లను సందర్శించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండేల ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని చెప్పారు.విధ్యార్థుల కంటె ముందు ఉపాధ్యాయులు ఆహారం తినాలనీ,రోజు ఒకేరకమైన కురగాయలు వడ్డించకుండా రోజుకోవిధంగా విద్యార్థులకు కురగాయలను అందివ్వాలని సూచించారు. పాడైన గుడ్లను ఇవ్వవద్దని,ఆహారంనాణ్యతగాఅందివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు

## డంపింగ్ యార్డును తరలించాలని వినతి

బిజెపినాయకుల వినతి



**మేడ్చల్, ఫిబ్రవరి 25. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపల్ పరిధి అత్వెల్లి గ్రామంలోని 2వ, 3వ వార్డుల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ మేడ్చల్ బిజెపి నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 2వ, 3వ వార్డుల్లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డులకు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల నుండి చెత్తను తరలించడంతో ఆ కాలుష్యంగా మారిందని వినతిలో పేర్కొన్నారు. అదే విదంగా మురికి మయంగా మారడంతో పాటు చెత్తను తగుల బెట్టడంతో దుర్వాసన, పొగతో అక్కడి సమీప ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. డంపింగ్ యార్డులను అక్కడి నుండి తరలించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జాకట ప్రేమ్ దాస్, ఈశ్వర్ కుర్మా, రాగం అర్జున్, జాకట బాబు రాజు, గౌలికర్ మహేష్, వేణు గోపాల్ పాల్గొన్నారు.

## మైసిగండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**కడ్తాల్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** కడ్తాల్ మండలంలోని మైసి గండి శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవ స్థానంలో గల శ్రీకాశీ విశ్వనాథ స్వామి మహాశి వరాత్రి మహోత్సవాలు మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కాశీవిశ్వనాథ స్వామి మహ శివరాత్రిబ్రహ్మోత్స వాలసందర్భంగా ఆలయ అర్చకులు విఘ్నేశ్వ రపూజ, ధ్వజారోహణం, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకమును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు సిరోలి పంతునాయక్, ట్రస్టు సభ్యులు ఆర్పి భాస్కర్, ఆలయ అర్చకులు యాదగిరి, అమూల్య పతి, భాను ప్రకాష్, సంతోష్, నాగేందర్ శర్మ, ఆలయ సిబ్బంది చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## విందులో పాల్గొన్న స్పీకర్

**శంకర్ పల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం సురభి ఎవెన్యూలోని పెద్ద మంగళారం మాజీ సర్పంచ్ చేగూరి రామకృష్ణగౌడ్ కుమార్తె వందన డాక్టర్ దినేష్ గౌడ్ వివాహ విందులో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన దంపతులపై అక్షి ంతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్ సౌకర్యాలపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మైనార్టీ నాయకులు

**కొడంగల్,ఫిబ్రవరి 25ప్రభాతవార్త :** ముస్లీం సోదరులు నెలరోజుల పాటు ఉపావాస దీక్షలతో పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కొడంగల్ మున్సిపాలిటీలో పూర్తి స్దాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ ఎస్.ఎం.గౌసన్ కోరారు.ఈ మేరకు మంగళవారం మైనార్టీ నాయకులతో కలిసి స్దానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర ్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మసీదుల దగ్గర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.అలాగే ప్రార్దన సమయాల్లో విద్యుత్,త్రాగునీటి సరఫరా సకాలంలో చేపట్టంతో పాటు మసీదుల దగ్గర పారిశుద్య పనులు,తాగునీటి సౌకర్యాం కల్పించాలని కోరారు.నమాజుకు వెళ్లే ముస్లీం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**పెద్దేముల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నాయని తింసాన్‌పల్లి కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షుడు అనిఫ్, ప్రధానకార్యదర్శి బుద్దారం నాగేష్‌లు అన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి గ్రామంలో రూ.3లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రొడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిఫ్,నాగేష్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్‌ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషిచేస్తున్న నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అని అన్నారు. సుస్థిర పాలన, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో గొల్ల వెంకటయ్య, గుడిసేశ్రీనివాస్, సత్యవర్ధన్‌రెడ్డి, రమేష్, నాగప్ప, అసిఫ్ అలీ, రవి, ఏఈ వినోద్‌కుమార్, గ్యాంగ్‌మెన్ క్రిష్ణ పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

**పూడూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి పౌరులు అందుకోసం ప్రతిఒక్కరు తమజీవితాలను అందంగా తీర్చిదిద్దుకోవాలని ప్రధానోపాధ్యాయులు మోసెస్,ఉపాధ్యాయులు రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపకున్నారు.ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు తమ గురుతర బాధ్యలను ఎరుగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు.విద్యార్థులు ప్రణాళిక బద్దంగా విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని,సమాజంలో పెద్దలపట్ల గౌరవంగా మెలిగిన వారికి మంచిగుర్తింపు ఉంటుందని వివరించారు.తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రైవేటు పాఠశాలలకన్నా ప్రభుత్వ పాఠశాలలో మంచి అనుభవమున్న ఉపాధ్యాయులు ఉండడంచేత విద్యార్థులు మెరుగైన విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.తరగతి గదిలో తమతోటి విద్యార్థులకు విద్యను బోదిస్తున్నసమయంలో వారినుండి వచ్చిన స్పందన జీవితంలో మరువలేనిదని, ఉపాధ్యాయులగా మారిన పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. తమ గురువుల ప్రోత్సా హంవల్లనే తాము ఉపాధ్యాయ వృత్తికి ఉండే విలువల గురించి తెలుసుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిష్ణ, సంపత్, నాగేష్, రాజు, సుభానయ్య, షఫి, జ్ఞానేశ్వరి, స్వాతి, పాల్గొనగా, డిఇఓగా కెభవాని, ఎంఇఓగాఆర్‌భరత్, ప్రధానోపాధాయులుగా జె భరత్, ఉపాధ్యాయులుగారారరణ్, సాయికిరణ్, హింధుప్రియ, కెహింధు, ప్రశాంత్, సాత్విక్, కీర్తన, వర్శిత, హర్శిత, సిద్దూ, జగదీష్, శశాంక్, అటెండర్లుగాగణేశ్వం, ఆకాష్‌లు విధులను నిర్వహించారు.

# ఆలయాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు

భద్రతకు కొత్త పుంతలు....

**కొత్తూర్,ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలక పరిధిలో ఆలయాల వద్ద భద్రతను పెంపొందించేందుకు పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చారు. కొత్తూర్ ఇన్స్పెక్టర్ నరసింహారావు సూచన మేరకు దేవాలయాలవద్ద నిఘానేత్రం ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖ సూచించింది. దీనికి స్పందించిన పలువురు నాయకులు, తమ స్వంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, భద్రతను మరింత బలోపేతం చేశారు. నిఘా నేత్రం ఏర్పాటు కొరకై కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్‌యాదవ్ 8వ వార్డులోని పోచమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.శ్రీశివమారుతి దేవాలయంలో తాండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మైసమ్మ అమ్మవారి దేవాలయంలో యువనాయకుడు శివచారి, ఎస్సీ కాలనీలో అమ్మవారి ఆలయంలో కౌన్సిలర్ ప్రసన్నల తయాదయ్య తమ సొంత నిధులతో ఈ భద్రత చర్యలు చేపట్టారు. పట్టణంలో ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల భక్తులకు మరింత భద్రత లభించడంతో పాటు, అవాంఛనీయ ఘటనలను అరికట్టే అవకాశం లభించనుందని పోలీసులు తెలిపారు. ఈ భద్రతా ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి భక్తులు, స్థానికప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల కమిషనర్ బాలాజీ, సదానందంగౌడ్, బండికృష్ణ, యాదగిరిచారి, రవినాయక్, రాఘవేందం యాదవ్, సాగర్, బండి శ్రావణ్, కరెంట్ బాలు, సబ్ ఇన్స్పెక్టర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శైవక్షేత్రాలు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

**కొడంగల్,ఫిబ్రవరి25ప్రభాతవార్త :** మహశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబైయ్యాయి.కొడంగల్ పట్టణంలోని గాడిబాయి శివాలయ,మహాదేవుని ఆలయంతో పాటు మండల పరిధిలోని లొంకబసవణ్ణ,పరమేశ్వర గుట్టతదితర శివాలయాలను రంగురంగుల దీపాలతో అలంకరించిముస్తాబు చేశారు.బుధవారం మహశివాత్రి సందర్భంగా ఉపావాస దీక్షలు చేపట్టిన భక్తులు శివాలయాలకు వెళ్ళి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహిస్తారు.అలాగేభక్తిశ్రద్దలతో భజన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఇందుకుగాను ఆయా ఆలయాలు భక్తులతో కిటకిట లాడనున్నాయి .ఆలయాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అ సౌకర్యాలు కలుగకుండా నిర్వహకులు తగు ఏర్పాట్లు చేశారు.

## శ్రీమల్లికార్జునుడి కోసం సిసి నిర్మాణం



శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ముందు సిమెంట్ బెడ్ నిర్మాణం చేపట్టిన దృశ్యం.

**నందిగామ,ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** నందిగామ మండలం ఉమ్మడి చేగూరు గ్రామం పరిధిలో గల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ముందు చేగూరు గ్రామానికి చెందిన యువ కాంగ్రెస్ నేత మంకాల శ్రీశైలం తన సొంత నిధులు రూ.2 లక్షలతో సిమెంట్ బెడ్ వేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఎన్నో ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ముందు భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు మంగళవారం ఆలయ గోపురం ముందు సిమెంటు బెడ్ వేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. శివభక్తితో ఇంత పెద్ద యజ్ఞానికి శ్రీకారం చుట్టిన శ్రీశైలం సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షులు ధరూర్ సతీష్ పటేల్, ఆలయఅర్చకులు వీరేశం, రాజశేఖర్, శివ, సాములయ్య, గుండాలవేణు, శ్రీను, నారాయణ తదితరులు ఉన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పేదలకు భరోసా

కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి



సిఎం ఆర్ ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఏమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి ఫిబ్రవరి 25;ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం చేయించుకోవాలనే ఉద్దేశంతోనే సీఎంఆర్ఎఫ్ పథకాన్ని కొనసాగిస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.మండలంలోని వివిధ అభివృద్ధి పనుల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరుకాగా వెల్జాల్ గ్రామంలోని బొడ్డు రవీందర్ గౌడ్ అనేవ్యక్తికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ ను ఎమ్మెల్యే కసిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎక్కువ మొత్తంలో కల్వకుర్తికే తీసుకరావడం జరిగిందని, కార్యకర్తలు ఈ విషయాన్ని మర్చిపోతున్నారనిఎమ్మెల్యే గుర్తుచేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడుడోకూర్‌ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహ,ఏఎంసి డైరెక్టర్లుఅంజయ్య గుప్తా,వెంకటరెడ్డి, నాయకులు భగవాన్ రెడ్డి, తుమ్మ నరసింహ, మాజీఎంపీటీసీయాదయ్య,ఆరీఫ్,అజీజ్, నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ



ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేస్తున్న గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి.

**బొంరాస్‌పేట్,ఫిబ్రవరి25,ప్రభాతవార్త :** జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి అధ్వర్యంలోమండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మఇండ్లకు ముగ్గువేసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు తెలంగాణ ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదలకోసం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని,అర్హులైన వారందరు కూడా ఇంటి నిర్మాణం చేపట్టాలని అన్నారు.ఇంటి నిర్మాణం కోసం రాష్ట్రప్రభుత్వం విడతల వారిగా మొత్తం 5లక్షల రూపాయాల ఆర్థికసహాయం చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులైన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వేచేసి ప్రస్తుతం నివాసం ఉన్న ఇంటి రకం,అద్దె ఇల్లు,స్లాబ్ ఇల్లు,బండల ఇల్లు ఉందా అనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో అర్హులైనవారివివరాలు కూడా అందులోనే రావడం జరిగిందన్నారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణం చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు నర్సిములుగౌడ్,పిఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ,మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వెంకట్‌రాములుగౌడ్,పార్టీ నాయకులు రాంరెడ్డి, గ్రామ అధ్యక్షులునర్సిములు,డైరెక్టర్ మల్లికార్జున్, నర్సిమనాయుడు, మల్లీకర్జున్,కిష్టప్ప,మాజీసర్పంచ్,కాంగ్రెస్‌పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

**దుద్యాల్,ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండలంలోని హకీంపేట్ గ్రామంలో మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యూఎస్ గాల వారి ఆర్థిక సహాయంతో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులకు ఆటల ద్వారా పిల్లలకు జీవన నైపుణ్యాలను నేర్పించే విధానం పై కొన్ని ప్రధానమైన అంశాల గూర్చి అవగాహన కల్పించారు. విధిగా పిల్లల్ని పాఠశాలలకు పంపించడం. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఫోన్లను అందించడం పై అవగాహన, అందిస్తే ఏం జరుగుతుందో అనే అంశాలపై చర్చ చేశారు. విద్యార్థుల జీవన నైపుణ్యాల గురించి వివరణ, విద్య యొక్క ప్రాముఖ్యత గూర్చి తెలిపారు. పిల్లలు యొక్క చదువు వారి భవిష్యత్తుకు సంబంధించి తల్లిదండ్రుల యొక్క బాధ్యతల గురించి తెలియజేశారు.

ఈ కార్యక్రమాని ఉద్దేశించి మ్యాజిక్ బస్ సిబ్బంది, హకీంపేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామ మహిమ సంఘాల అధ్యక్షులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాట్లాడారు. మ్యాజిక్ బస్ సిబ్బంది, లైఫ్ స్కిల్ ఎడ్యుకేటర్ పిట్ల నరేష్ కుమార్, అకాడమీక్ ఎడ్యుకేటర్ తెలుగు వెంకటయ్య, మహేందర్, హనుమంతు, నర్సింలు అకాడమిక్ ఎడ్యుకేటర్స్ నర్సింలు గౌడ్, వేణుగోపాల్, కృష్ణ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సతీష్ బాబులు పాల్గొన్నారు.

# 8 కోట్ల రూపాయలతో దేవాలయాల అభివృద్ధి



తలకొండపల్లిలో నూతనంగా నిర్మించిన శివుని విగ్రహం

**తలకొండపల్లి ఫిబ్రవరి 25: ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండలం కేంద్రంలో పెద్ద ఎత్తున దేవాలయాల అభివృద్ధికి తలకొండపల్లి జెడ్పిటిసి, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కృషి చేశారు. తలకొండపల్లి గ్రామంలో అతి పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం గ్రామానికి ఉత్తరాభాగాన గ్రామ సమీపంలో గల గుట్టపై వెలిసి ఉన్నది. ఈ దేవాలయం అతి పురాతనమైనది కావడంతో భక్తులు సైతం తక్కువ సంఖ్యలోనే వచ్చి తమ మొక్కులు తీర్చుకునేవారు. తలకొండపల్లి గ్రామానికి చెందిన వారు మాత్రమే ఈ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి అడపదడపావచ్చిమొక్కులు చెల్లించుకునేవారు. తలకొండపల్లి గ్రామానికి చెందిన ఉప్పల వెంకటేష్ ఇది గమనించి తను సొంత గ్రామానికి ఏదో ఒకటి చేయాలని దృఢ సంకల్పంతో దేవాలయం పునరు ద్ధరణకు పూనుకున్నాడు. గత 2019 స్థానిక ఎన్నికల్లో తలకొండపల్లి మండలం జెడ్పి టిసిగా పోటీ చేసే క్రమంలో తమ గ్రామానికి, గ్రామ ప్రజలు, మండల ప్రజలు గుర్తుంచ ుకునే ఈ దేవాలయం పునర్నిం ్మాణానికి పూనుకొని అప్పట్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటప్రకారం సుమారు 4 కోట్ల రూపాయలు వెచ్చించి లక్ష్మీ నరసింహ స్వామి దేవా లయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాడు. దేవాలయం సమీపంలోనే గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి దేవాలయం నిర్మి ంచాడు. ఈ దేవాలయంలో పెద్ద ఎత్తున 5000మందికి సరిపడా అన్నదాన సత్రం నిర్మించినిరుపేద ప్రజలు పెళ్లిళ్లు చేసుకునే ందుకు వీలుగా అన్ని సకల సౌకర్యాలతో నిర్మింప చేశాడు. ఈ దేవాలయం గుట్టపైన ఉండడంతో తలకొండపల్లి గ్రామం నుంచి దేవాలయం వెళ్లే రోడ్డు వరకు రవాణా సౌకర్యం కోసం భక్తుల రాకపోకలు సులువుగా ఉండేందుకు సీసీ రోడ్డును

### సర్వాంగ సుందరంగా3 కోట్లతో శంకరుని విగ్రహం నాగ సాధువులతో నేడు ఆవిష్కరణ

నిర్మింప చేశాడు.లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం గుట్ట సమీపంలో నూతనంగా శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పూనుకొని విగ్రహాన్ని పూర్తి చేశాడు. లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం గుట్ట సమీపంలో గల మరొక గుట్ట పైన నూతనంగా సుమారు 50 అడుగుల శివుని విగ్రహాన్ని 4 కోట్ల రూపాయలు ఖర్చు చేసి శంకర్ నిగ్రహాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాడు. మహాశివరాత్రి సందర్భంగా ఈ శివుని విగ్రహాన్ని హిమాలయ పర్వతాల్లో ఉండే నాగ సాధువులను రప్పించి వారి చేతులమీదుగా శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రారంభించనున్నారు. శివరాత్రి సందర్భంగా గత రెండు రోజులుగా దేవాలయం సమీపంలో ప్రత్యేక పూజలు యజ్ఞ కార్యక్రమాలను ఉప్పల వెంకటేష్ మంజుల సతి సమేతంగా పాల్గొని పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం దేవాలయం సమీపంలో కుటుంబ సమేతంగా పాల్గొని బ్రాహ్మణులచే యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ప్రతి ఏటా శివరాత్రి ఉత్సవాలు**

తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివుని విగ్రహాన్ని బుధవారం ప్రారంభించి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉప్పల వెంకటేష్ తెలిపారు. బుధవారం రాత్రి మొత్తం జాగరణతో, నాగ సాధువులతో ప్రవచనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు, కర్తాల్, కేశంపేట్, తలకొండపల్లి ,ఆమనగల్, మిడ్జిల్ మండలాలకు చెందిన పలురు భక్తులు తరలివస్తున్నట్లు ఆయన తెలిపారు.



## కాలనీల్లో సిసి రోడ్లు నాణ్యతతో నిర్మించాలి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ పావని

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** కాలనీలలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల పనులలో నాణ్యత పాటించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 1వ వార్డు పరిధిలోని కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్ లలో జరుగుతున్న సిమెంట్‌రోడ్ల నిరా ్మణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. మున్సిపల్ నుంచి రూ.12 లక్షలు కేటాయించి రెండు చోట్ల సిసి రోడ్లు వేయిస్తున్నారు.

ఆయా వార్డులకు కేటాయించిన నిధులతో సిసి రోడ్లు నిర్మిస్తున్నారని ప్రజలకు సౌకర్యవంతంగా రోడ్డు వేయాలని ఆమె అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. రోడ్డు పనుల్లో ఏలాంటి అవకతవకలకు తావులేకుండా నాణ్యమైన సిమెంట్ వినియోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దక్కి రమేష్, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కొరుబోతు నాగరాజు, ఇమ్మిడి యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంకమ్మగూడలో మల్లికార్జునస్వామి జాతర



శ్రీమల్లికార్జునస్వామికళ్యాణానికి ముస్తాబైన దేవాలయం

**నందిగామ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
దేవదేవుడైన మహాదేవుని పుణ్యదర్శనం కలిగే భాగ్యం వచ్చింది. ఈనెల 26వతేదీ బుధవారంనుండి మహాశివరాత్రి మహోత్సవాలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. నందిగామమండలం వెంకమ్మగూడలో పురాతన కాలంనాటి బండమీది మహిమాన్విత శ్రీమల్లికార్జునస్వామికళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించుటకు ఆలయపూజారి వీరేశంస్వామి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లుచేశారు. నర్సప్పగూడ శ్రీవెంకటగిరి కొండపై వెలసిన మహాశివలింగానికి పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బుగ్గోనిగూడలో శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం, నందిగామలో లింగమూర్తుల దేవాలయం, రంగాపూరు, ఈదులపల్లి శ్రీవీరభద్ర నాగలింగేశ్వరస్వామి దేవాలయం, వీర్లపల్లిలో శివాలయాలు పూజలు నిర్వహించేందుకు ముస్తాబయ్యాయి. కఠిన ఉపవాసదీక్షలో ఉండే శివభక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లుచేశారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా వెంకమ్మగూడలో జరిగే శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరవుతున్నట్లు ఆలయకమిటీ ధరూర్ సతీష్‌పాటిల్ తెలిపారు. నాలుగురోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగే ఈజాతరను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## మహిళాభ్యుదయం ద్వారానే దేశాభివృద్ధి



మహిళాసమైక్య భవననిర్మాణానికి భూమిపూజచేస్తున్న మాజీ ఎంపిటిసిలు

**నందిగామ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ మహిళాసంక్షేమానికి పెద్దపీట వేయడం అభినందనీయమని మాజీ ఎంపిటిసి, జిల్లా ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, మాజీ ఎంపిటిసి చంద్రపాల్‌రెడ్డిలు స్పష్టం చేశారు. మంగళవారం నందిగామ మండలకేంద్రంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో జిల్లాపరిషత్ నిధులు రూ.10లక్షలతో మహిళాసమైక్య భవననిర్మాణానికి ముగ్గుపోసి భూమిపూజచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకచొరవతో మండలం అన్నిరంగాలలో ప్రగతిపథంలో అడుగులువేస్తుందని కితాబిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు హైస్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్, బొమ్మగల నరసింహులు, శివగళ్ళ సుమన్, కాంట్రాక్టర్ బిక్షపతి, మహిళాసంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కుసుమపంట క్షేత్రప్రదర్శన సందర్శనకు వచ్చిన ఒడిస్సా రైతులు

**షాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తిరుమలాపూర్‌గ్రామంలో సాగుతున్న కుసుమపంటను ఒడిస్సాకు చెందిన రైతులు మంగళవారం సందర్శించారు. భారతీయ నూనెగింజల సంస్థ సహకారంతో మండలంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు సాగు చేస్తున్న కుసుమపంటను సందర్శించి పంటలసాగులో పలు మెలకువలను అడిగితెలుసుకున్నారు. ఒడిస్సాలో నూనెగింజల సాగు మెరుగుపరచడానికి ఆధునికవిధానాలపై రైతుశిక్షణ అనే అంశంపై ఐదురోజుల కార్యక్రమంలో భాగంగా భారతీయ నూనెగింజల సంస్థ రాజేంద్రనగర్‌కు రావడం జరిగింది. అందులో భాగంగా తిరుమలపూర్‌గ్రామాన్ని సందర్శించి సాగు పద్ధతులు, సుగుణమాల రైతు ఉత్పత్తిదారులసంఘం చేస్తున్న కార్యక్రమాల అమలుగురించి తెలుసుకోవడంజరిగింది. గ్రామంలో సాగుచేస్తున్న బ్రకోలీ, క్యారెట్, వివిధరకాల కురగాయపంటల సాగుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, టెక్నీషియన్ నందీశ్వర్, డేకనల్ జిల్లా ప్రేమనంద్ ధాల్, కోఆర్డినేటర్ భికున్‌నాయక్, గ్రామరైతులు అనంతరెడ్డి, మాధవరెడ్డి, సాయిరెడ్డి, అంజయ్య, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హాజీపల్లిని సందర్శించిన ఢిల్లీ వరల్డ్‌స్కూల్ బృందం



**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

హాజీపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంవద్ద ఢిల్లీవరల్డ్‌స్కూల్ బృందం

ఫరూఖ్‌నగర్‌మండలం హాజీపల్లిగ్రామాన్ని షాద్‌నగర్‌పట్టణంలోని ఢిల్లీ వరల్డ్‌స్కూల్ విద్యార్థులు సందర్శించారు. హాజీపల్లిగ్రామ అభివృద్ధి, ఫైబర్ నెట్ ఫైలెట్‌ప్రాజెక్టుగా ఎంపికకావడం, గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటు, పచ్చదనం, పరిశుభ్రత గురించి విద్యార్థులు గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా 150మంది విద్యార్థులు గ్రామపంచాయతీ కార్యాలయం, నర్సరీ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హాజీపల్లిగ్రామ మాజీ ఉపసర్పంచ్ సింగారం సుదర్శన్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో శ్రద్ధ వహిస్తూ పచ్చదనం, పరిశుభ్రతపై ప్రభుత్వ సహకారం లభించేలా చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకాధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మహాశివరాత్రిపర్వదినాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో శ్రీ భవానీ సహిత సహస్ర లింగేశ్వర వీరాంజనేయ స్వామి దేవాలయంలో శివపార్వతులకళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, పట్టణపార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, నేతలు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి, మాధవులుయాదవ్, తుపాకుల శేఖర్, ఖదీర్, శ్రీనివాస్, అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, వెంకటకృష్ణశర్మ, కాలనీవాసులు బాలగోపాల్, మదన్‌గోపాల్, బాల రాజేష్, బాలయ్య, యాదగిరి, కెబి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతులమీదుగా ఎల్ఓసి అందజేత

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షాద్‌నగర్‌మున్సిపాలిటీ 15వ వార్డుకుచెందిన చంద్రకళకు లక్షరూపాయల సిఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీ మంజూరుచేయించి స్వయంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రవితేజ, మమహ్మద్, సాయికుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిమాన్విత క్షేత్రం శ్రీ పాంబండ రామలింగేశ్వర ఆలయం



ఉత్సవాలకు ముస్తాబైన పాంబండ దేవస్థానం

**కుల్కచర్ల, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
బ్రహ్మోత్సవాలు మినహా అధికసంఖ్యలో శివరాత్రి ఉత్సవాల్లో పాంబండదేవస్థానానికి విచ్చేసేభక్తులకు ఎటువంటి అసౌకర్యంకలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్టు ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య అన్నారు. మంగళవారం ఆలయముస్తాబుసమయంలో వారు మాట్లాడుతూ, మహిమాన్వితక్షేత్రంగా, భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పాంబండదేవస్థానం ఎంతోప్రాచుర్యంగల దేవస్థానం అని వారుతెలిపారు. ఏటా రెండుసార్లు చిన్నజాతర పెద్దజాతరగా పిలువబడి రెండు ఉత్సవాల ు ఘనంగా నిర్వహించుకుంటామని అలాగే శివరాత్రి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలతోపాటు ప్రత్యేక అలంకరణలు జరుగుతాయని వారు వివరించారు. ప్రతిసంవత్సరం మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన శివరాత్రినాడు భక్తులు పవిత్ర ఉపవాసదీక్షలతో స్వయంగా శ్రీరామచంద్రుడి పవిత్రహస్తాలతో ప్రతిష్ఠించబడి దేదీప్యమానంగా వెలుగొందుతున్న పాంబండ ఆలయందర్శిస్తారని తెలిపారు.సాక్షాత్తు శ్రీరాముడు తిరుగాడిన ఏకశిలాపర్వతమే పాంబండ దేవస్థానం అని మట్టికూడా కనిపించనిస్థలంలో శ్రీరాముడు తన ధనుర్బాణాలతో కోనేరును తయారుచేసి స్వయంగా శివుడికి అభిషేకించారాని ఇక్కడి పవిత్ర స్థలపురాణం. దినదిన అభివృద్ధిచెందుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఆలయ విశిష్టత తెలిసిందంటే ఘనచరిత్ర దేవస్థానానికి ఉందని భక్తుల విశ్వాసం అని వారు తెలిపారు.

**-పాంబండ స్థల పురాణం...**

త్రేతాయుగంలో రావణసంహారం అనంతరం తిరిగి వస్తున్న సమయంలో బ్రహ్మహత్యా పాపం నుండి విముక్తికోసం కోటిలింగాలను స్థాపించాలని శ్రీరాముడికి మహర్షులు సూచిస్తారు. అందులో భాగంగానే ఆయనస్వయంగా లింగాన్ని స్థాపించి పూజలు నిర్వహించాడు. ఏకశిలా పర్వతం పైన స్థాపించిన ఈశివలింగమే నేడు శ్రీ రామలింగేశ్వరుడుగా వెలుగొందుతున్నారు. ఏకశిల పాము ఆకారంలో ఉండడంవల్ల ఆలయానికి పాంబండ అని పేరుగాంచింది. పూర్వం ఇదిపెద్ద ఏకశిలగానే ఉండేది అప్పట్లో పెద్దపాము బండరాయిమధ్యలోనుంచి వెళ్లడంతో రెండుగాచీలిందని స్థలపురాణం. ఆలయం వెనుకభాగంలో ఒకపుట్టులింగం ఉంది. అది ప్రతి సంవత్సరం కొద్దికొద్దిగా పెరుగుతూ ఉందని భక్తుల విశ్వాసం. ఆలయం పక్కనే భ్రమరాంబాదేవి ఆలయం, ముందుభాగంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంటుంది. ప్రతియేటా శివరాత్రినాడు భక్తులు ఉపవాసదీక్షతో అధికసంఖ్యలో పాల్గొంటారు. వారికి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు అందు బాటులో ఉన్నాయి. ఆలయకమిటీసభ్యులతో పర్య వేక్షించి తోపులాటలు జరగకుండా స్వామివారిని దర్శించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ చైర్మన్ మహీపాల్ రెడ్డి అన్నారు. శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం అని ఆలయ ఈవో బాలనర్సయ్య తెలిపారు. ఎంతో ప్రాచుర్యంగల పాంబండదేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలుచేపట్టిన తర్వాత మొదటి సారివస్తున్న శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసాము. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల ు పెంచి అందరికీ స్వామివారి దర్శనం జరిగేలా చర్యలుతీసుకున్నాం అని తెలిపారు.

# కొడంగల్ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం అభినందనీయం

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



రైతులకు నష్టపరిహారం చెక్కులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవుతున్న రైతులు అభినందనీయులని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న బహుళార్థసాధక పారిశ్రామిక పార్క్‌కు దుద్యాల మండలం, లగచర్ల గ్రామ సర్వేనెంబర్ 102లోని 22మంది రైతులకు సంబంధించిన 31.35ఎకరాల భూమికి 6.38కోట్ల నష్టపరిహార చెక్కులను మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులకు అందజేశారు. ఈసందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల త్యాగాల ఫలితంగా కొడంగల్ ప్రాంతం పారిశ్రామికపార్క్ ఏర్పాటుకు సన్నద్ధం అవుతుందన్నారు. రైతుల సహకారం వల్ల పరిశ్రమలు రావడంతో కొడంగల్‌ప్రాంత అభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. భూములు ఇచ్చేందుకు సమ్మతించిన రైతులకు ఒకేదఫాలో చెక్కులరూపంలో నష్టపరిహారాన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నష్టపరిహారం ద్వారా వచ్చిన డబ్బులను కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడేవిధంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ ఓవిటి శారద, అసిస్టెంట్ జోన్ మేనేజర్ అజీమా సుల్తానా, దుద్యాల తాసిల్దార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసిపికి నూతన సంవత్సర డైరీ అందజేత

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ ఏసిపి సిహెచ్ రంగస్వామికి తెలంగాణ బిసి మహాసభ నూతన సంవత్సర డైరీని మహాసభ నాయకులు అందజేశారు. ఈకార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్, మహాసభ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కటికె కృష్ణాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడిచర్ల యాదయ్యలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో గిరిజనతండాల అభివృద్ధి

**-కుల్కచర్ల మార్కెట్‌కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు**



సిసిరోడ్డును ప్రారంభిస్తున్న మార్కెట్‌కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు

**కుల్కచర్ల, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
స్థానిక పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాలు గిరిజన తండాలు అభివృద్ధి సాధిస్తున్నాయని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల పరిధిలోని పటేల్‌చెరువుతండా గ్రామపంచాయతీ, కిచ్చన్నకుంటతండాలో ఎన్ఆర్ఈజీఎస్‌నిధుల నుండి 5లక్షల రూపాయలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదిసంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేక గిరిజనతండాలు వె ఎకబడిపోయాయని ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కొక్కటిగా సాధించుకుంటూ వస్తున్నారని ఆయన తెలిపారు. చాలాగిరిజన తండాల్లో చాలాపనులు పెండింగ్లో ఉన్నాయని వాటిని త్వరితగతిన మొదలుపెట్టి పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి అండదండలతో పరిగి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి సాధించి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్టిసెల్ శివరాంనాయక్, నాయకులు చంద్రభూపాల్రావు, విటల్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధంకావాలి




గ్రాఫాలజిస్ట్ మల్లిఖార్జునరావును సన్మానిస్తున్న నాగారం పాఠశాల ఉపాధ్యాయులు

**కీసర, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని భారతదేశ మొదటి గ్రాఫాలజిస్ట్ డాక్టర్ మల్లిఖార్జునరావు అన్నారు. మంగళవారం నాగారం ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులో మంచిప్రతిభను కనబరచడానికి చేతిరాత ముఖ్యమని ఉత్తేజపరిచారు.10 తరగతి విద్యార్థులు పబ్లిక్‌పరీక్ష రాసేసమయంలో మంచిమార్కులు సాధించడానికి చేతిరాతలో మెళకువలు తెలిపారు. ప్రభుత్వపాఠశాలలోచదివి యుకె యూనివర్సిటీలో గ్రాఫాలజీ నేర్చుకుని ఈస్థాయికి ఎదిగానన్నారు. మీరు కూడా మీ భవిష్యత్తులో ఎలా ఉండాలో నిర్ణయించుకుని దానికోసం మంచి కృషిచేయాలి అన్నారు. చేతిరాతనుబట్టి వారిమనస్తత్వం ఉంటుందన్నారు. చేతి రాతతో మీతలరాతను మార్చుకోమని ఉద్బోధించారు. మీ భవిష్యత్తు మీ చేతిలో ఉందని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజ, రాజ్యలక్ష్మీ, అరవింద్‌కుమార్, శ్రీదేవి, రఘు, వందన, వరమ్మ, సరిత, పద్మ, సుమతి, సంధ్యారాణి, కమల, గాయత్రి, సంజయ్, రాణిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రామేశ్వరం దేవస్థానానికి భక్తుడి ఔదార్యం

**-దేవాలయం ముందు రూ.80వేల విలువగల గేటు బిగించిన దాత**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో నర్సప్పగూడగ్రామానికి చెందిన కె.సురేందర్ దేవాలయానికి గేటును విరాళంగాప్రకటించారు. రూ.80వేల విలువగలగేటును తయారుచేయించి దేవాలయ భద్రతదృష్ట్యా మంగళవారం దేవాలయం ముందు ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా దాత సురేందర్ మాట్లాడుతూ ఎంతోమహత్తుగల పరమేశ్వరుడి ఆలయానికి గేటును విరాళంగా అందించడం ఆనందంగా ఉందని అన్నారు. దేవాలయాభివృద్ధికి ఇకముందు కూడా ఏదైనా అవసరం ఉంటే తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరుణ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు టి.మోహన్‌రెడ్డి, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్థుల చేయూత

**పరిగి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
వికారాబాద్‌జిల్లా పరిగిమండలం రాపోలుగ్రామంలో 15రోజుల క్రితం పరిగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిసి కెమెరాలు ఏర్పాటు గురించి అవగాహన కల్పించారు. రాపోలు గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకురావాలని ఎస్ఐ పిలుపు నివ్వడంతో, సిసి కెమెరాలను ఏర్పాటు చేయడానికి వ్యాపారస్తులు 78వేల రూపాయలను పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్‌కి అందజేశారు.యూత్ కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్, కిరాణా షాపు యజమానులు పెంటయ్య,కట్ట ప్రభు, కొండల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్,బసవరాజ, చిన్నయ్య, సిహెచ్ రాజు, పి.అనిత,మజీద్‌భాయ్,జంగయ్యయాదవ్,ప్రభులింగం, రఘు, కృష్ణ, కోట శ్రీశైలం, దాతలుకలిసి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు నగదును అందజేశారు.

## అంబేద్కర్ సంఘం నియోజకవర్గ నూతన కమిటీ

**కొడంగల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
అంబేద్కర్ సంఘం కొడంగల్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కొడంగల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో అంబేద్కర్‌సంఘం కొడంగల్‌నియోజకవర్గ అధ్యక్షులుగా చెవిటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా బాయికాడి లక్ష్మీణ్, చంధు, ప్రధానకార్యదర్శిగా ఎల్.బాలు, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా సురేష్‌బాబు, సభ్యులుగా భీములు, ఎం.వెంకట్,క్రిష్ణ,శివ,మహేష్,మహేష్‌లతోపాటు సలహాదారులుగా ఎస్.సోమశేఖర్, ఎన్.దస్తప్ప, డి.దాము, కమ్మరి సాయిలు, మ్యాతరి అశోక్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతనకమిటీ సభ్యులను సన్మానించారు.

## మైనార్టీ నాయకుల శ్రమదానం

**కొడంగల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
కొడంగల్ మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన మైనార్టీ నాయకులు శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు.పట్టణంలోని శాంతినగర్ కాలనీకి వెళ్ళే రహదారిలోని కల్వర్టు దగ్గర రోడ్డు అధ్వాన్నంగా మారి వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడింది. కల్వర్టుముందు రోడ్డు గుంతలమయంగా మారడంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఎలాంటి ఫలితం దక్కలేదు.ఈ క్రమంలో శాంతినగర్ కాలనీకి చెందిన మైనార్టీ ప్రసిడెంట్ సయ్యద్ హమీద్ అలీ,అబ్దుల్ కలీం,ఇనాయత్ ఖాన్ తదితరులు తమ స్వంత నిధులతో మొర్రం తెప్పించి డోజర్‌తో గుంతలను మట్టితో నింపారు.మైనార్టీ నాయకుల చొరవతో వాహనదారుల ఇబ్బందులు తొలగిపోయాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.




కల్వర్టు దగ్గర డోజర్‌తో మట్టిని చదును చేస్తున్న మైనార్టీ నాయకులు

## శ్రీరాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**-అట్టహాసంగా ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు**

**మహేశ్వరం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
శివరాత్రి సందర్భంగా మంగళవారం అంగరంగవైభవంగా శ్రీరాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవచనము, ధ్వజారోహణ పూజాకార్యక్రమాలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. వివిధశాఖల అధికారులు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అల్లె కుమార్, ఈవో మురళీకృష్ణ, పూర్ణచంద్రారెడ్డి, మునగపాటి నవీన్, సుదర్శన్‌యాదవ్, ఏకలవ్య, మిద్దింటి బాలరాజ్, ఆనందం, కాకి కుమార్, శ్రీకాంత్, రాకేష్, హరికృష్ణ ముదిరాజ్, శంకర్, నరేష్, తిరుపతయ్య, సాయిలు, శ్రీశైలం, సువర్ణ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివారాధనతో మనిషికి మోక్షం

**-మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
శివారాధనతో మనిషికి మోక్షంలభిస్తుందని మాజీఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం జాతర ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. దేవాలయంలో శివలింగానికి అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినాన దేవాలయంలో ఘనంగా పూజలుచేయడంతోపాటు, జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం హిందూధర్మానికి నిదర్శనమని, మన ప్రాంత ప్రజల ఐక్యతకు సూచిక అని పేర్కొన్నారు. మహాశివరాత్రి హిందువులకు ప్రత్యేక పర్వదినమని, ఆరోజు శివున్ని ఆరాధిస్తే మోక్షం లభించడంతోపాటు మంచి జరుగుతుందని అన్నారు. భక్తులు ఉపవాసం ఉంటూ శివనామ స్మరణలో లీనమై ఉంటారని, ఈపరిణామం మన భక్తికి, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, భక్తులకుకావాల్సిన మౌలికవసతులు కల్పించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ వైస్‌చైర్మన్ నటరాజన్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు వీరేశంగుప్తా, హరిగౌడ్, మాజీ సర్పంచులు రంగయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, చందునాయక్, చంద్రశేఖర్, స్థానిక నాయకులు జనార్ధన్‌గౌడ్, రాజుయాదవ్, కిట్టు,వాసు,లింగం, రాములు, వెంకటేష్, ఆనంద్, గుండు అశోక్, కంది రాఘవేందర్‌గౌడ్, పులిజాల నవీన్, దుమ్మని నవీన్, వెంకటేష్‌గుప్తా, ఆంజనేయులు, శీలం శ్రీకాంత్, రాజశేఖర్,సంజునాయక్,సాయియాదవ్,తేజలు పాల్గొన్నారు.

## సిసిరోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జర్నలిస్టు మారం చంద్రశేఖర్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలనీలో సిసి రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈసందర్భంగా కాలనీకి చెందిన సీనియర్ జర్నలిస్టు మారం చంద్రశేఖర్ ఎమ్మెల్యేకు తేనీటివిందు ఏర్పాటుచేశారు. కాలనీ అభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్యేను కుటుంబసభ్యులతో కలిసి సన్మానించారు.

## కంటిపరీక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటిపరీక్షలను తెలంగాణరాష్ట్ర నేషనల్ ప్రోగ్రామ్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ జాయింట్‌డైరెక్టర్, డాక్టర్ పి.మోతీలాల్ ఆకస్మిక తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా చూసుకోవాలని, అందరికీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థులకు బిస్కెట్లు, వాటర్ బాటిల్ తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆప్తాల్మిక్ డాక్టర్ పద్మలతతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చూపును రికార్డు చేసి, అన్‌లైన్ డాటా పంపి, అద్దాలు తెప్పించాలని సూచించారు. రోజు ఎంతమంది విద్యార్థులకు పరీక్షలు చేశారని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని అడగగా 280మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సుజాత,శ్రీకాంత్, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు చంద్రశేఖర్,నరేందర్‌రెడ్డి,రమేష్,ఫార్మసిస్టులు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## రామేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన సిఐ

**వాహనాల రద్దీ అంశాన్ని పరిశీలించిన ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
రామేశ్వరం పవిత్ర పుణ్యక్షేత్రం బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు జరిగే శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షలాదిమంది భక్తులు దర్శనార్థం వస్తున్నక్రమంలో పోలీసులు దేవాలయంవద్ద భక్తులకు సంబంధించిన క్యూలైన్లు, బారికేడ్లను పరిశీలించారు. అదేవిధంగా ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ వాహనాల రాకపోకలు, రద్దీ అంశాలను పరిశీలించారు. నేడు దేవాలయానికి షాద్‌నగర్ నియోజకవర్గం నుండే కాకుండా జడ్చర్ల, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, తదితర ప్రాంతాలనుండి భక్తులు పెద్దఎత్తున ఆలయాన్ని సందర్శించనున్నారు. ఓవైపుజాతర, మరోవైపు శివరాత్రివేడుకలు ఘనంగా జరగనున్న నేపథ్యంలో భక్తులు ఉపవాసదీక్షల విరమణ అదేవిధంగా జాగరణ కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉండడంతో ఇక్కడ ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. అయితే మంగళవారం రామేశ్వరం ఆలయాన్ని సిఐలు విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌లతోపాటు కాంగ్రెస్ యువనాయకుడు రాయికల్ శ్రీనివాస్ తదితరులు దేవాలయంలో భక్తుల సౌకర్యాలపై ఆరాతీశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానని అన్నారు.

## లక్కీనెంబర్ కోసం రూ.4.55 లక్షలు వెచ్చించిన వాహనదారుడు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25:**
నూతనంగా కొనుగోలు చేసిన వాహనానికి లక్కీ నెంబర్ కావాలనుకున్నాడు. లక్కీ నెంబర్ దక్కించుకోవడానికి రూ.4.55 లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నాడు. వివరాల్లోకి వెళ్ళితే..వికారాబాద్ జిల్లాలోని పరిగి రవాణా శాఖ కార్యాలయంలో ఆన్ లైన్ లో నిర్వహించిన వాహన నెంబరు వేలం పాటలో "9999" నంబర్ కోసం పలువురు వాహనదారులు పోటీ పడ్డారు. చివరకు ఆ నంబర్ ను గిరిజపురం మాధవ రెడ్డి రూ.4,55,450 వేలం పాట ద్వారా నంబర్‌ను దక్కించుకున్నట్లు జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. కొత్త సిరీస్ ప్రారంభం కావడంతో ఈ సారి పరిగి యూనిట్ కార్యాలయానికి రూ.7,17,149 భారీ ఆదాయం లభించినట్లు ఆయన వెల్లడించారు.

## మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శైవక్షేత్రాలు ముస్తాబు చేశారు. శివరాత్రి రోజున భక్తులు శివాలయాలకు వస్తుండటంతో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయకమిటీల సభ్యులు తగిన ఏర్పాట్లుచేస్తున్నారు. ఘట్‌కేసర్‌లోని శ్రీహరిహరభవానిక్షేత్రం, లింగాలకుంట శ్రీస్వయంభూ నాగలింగేశ్వరస్వామి, శివారెడ్డిగూడ శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ–మల్లికార్జునస్వామి, ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వేశ్వరగిరిక్షేత్రం, కొండాపూర్‌లోని శివాలయం, ఎదులాబాద్‌లోని శ్రీభమరాంబికామల్లికార్జునస్వామి, అంకుశాపూర్‌లోని శ్రీశివపంచాయతన స్ఫటికలింగేశ్వరస్వామి ఆలయం, అవుషాపూర్‌లోని పంచాయతనసహిత శ్రీఉమా మహేశ్వర స్వామి ఆలయాలలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.